క్లుప్తంగా

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మడికొండ: బహుళ అమావాస్య సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల మహాన్యాస రుద్రాభిషేకం, శుద్ధమైన నువ్వుల నూనెతో తైలాభిషేకం చేసి, ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే, రామాలయంలో సీతారామచంద్రస్వామికి ప్రత్యేక అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో కార్యనిర్వాహణధికారి శేషభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

కార్తీక మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. సాయంకాలం సూర్యాస్తమయంలో రోజూ హరిహరులకు ఆకాశ దీపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శ్రీసూక్త యాగం, ధనలక్ష్మి పూజ



హన్మకొండ కల్చరల్: దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అష్టైశ్వర్యాలు కలగాలని దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఉద్బోధించారు. దీపావళి వేడుకల్లో భాగంగా ములుగురోడ్డులోని వరద దత్తక్షేత్రంలో స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితులు ఆదివారం ఉదయం విశేష పూజలు చేశారు. ఉదయం 10గంటలకు శ్రీసూక్త మహాలక్ష్మి యాగం, సాయంత్రం 6గంటలకు అమ్మవారికి ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. కొత్తనాణెలతో అమ్మవారికి అర్చన చేసి దీపోత్సవం నిర్వహించారు.

కాజీపేటలో సమాధుల పండుగ



కాజీపేట: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మృతి చెందిన తమ వారి జ్ఞాపకార్థ పెద్దల పండుగను పలు కుటుంబాల సభ్యులు ఆదివారం రాత్రి జరుపుకున్నారు. తమ కుటుంబాల ఉన్నతి కోసం శ్రమించిన పెద్దలు, చిన్నలను స్మరించుకుంటూ కాజీపేట పట్టణంలోని పలు శ్మశాన వాటికల్లో ఉన్న సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక అలంకరణలు చేశారు. పెద్దలను తలుచుకుంటూ తీసుకెళ్లిన ఆహార పదార్థాలను సమాధుల వద్ద పెట్టి బరువెక్కిన మనస్సుతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, నాయకులు మర్యాల కృష్ణ, మిట్టపల్లి రవీందర్, వినయ్, రసూల్‌తో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కృతజ్ఞతార్పణల వేడుక

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్‌లోని గెత్సెమనె చర్చిలో ఆదివారం కృతజ్ఞతార్పణల పండుగను క్రైస్తవులు జరుపుకున్నారు. కరుణాపురం క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం దైవజనుడు రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని బైబిల్ వ్యాఖ్యోపదేశం చేశారు. అనంతరం జయప్రకాష్‌ను సంఘం సభ్యులు సన్మానించారు. చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చర్చి సభ్యులు సమర్పించిన అర్పణల వస్తువులను వేలం వేశారు.

మైనారిటీల అభివృద్ధే ధ్యేయం



హన్మకొండ: మైనారిటీల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, ఎండీ.నయీం, అన్వర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోనీ బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్.. తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని అన్నారు. పదవిలో కూర్చోబెట్టిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను అజీజ్‌ఖాన్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఈనెల 14న హనుమకొండలో జరగనున్న ముస్లిం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ వస్తున్నారని చెప్పారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు షఫీ, మహమ్మద్, అఫ్జల్, సోనీ, బియాబాని, హుస్సేన్, ఖలీల్, హిఫ్రోజ్, తస్లీమ్, అయేషా పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ శేషభారతి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం, అమ్మవారి శేష వస్త్రాలు అందజేశారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



వర్ధన్నపేట: కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్



వరంగల్: 14వ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

● బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్

హసన్‌పర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. నగరంలోని 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో సోమవారం చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిట్టల రాజు, మహిళా మోర్చా నాయకురాలు పిట్టల స్వప్న, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చీపురు వెంకటస్వామి, ల్యాబర్తికి చెందిన బీఎస్పీ నుంచి మండల అధ్యక్షుడు సంకినేని మధుతో పాటు 100 మంది కార్యకర్తలు అరూరి రమేష్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

ఇంకా పోలీసుననుకుంటున్నాడు..

హసన్‌పర్తి: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఆర్.నాగరాజు ఇంకా పోలీసుననుకుంటున్నాడని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్ విమర్శించారు. హనుమకొండలోని అరూరి రమేష్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. వర్ధన్నపేట పోలీస్ అధికారిగా ఉన్నప్పుడు పలువురిపై అక్రమ కేసులు పెట్టిన నాగరాజు.. రిటైర్డ్ అయ్యాక కూడా కేసులు పెడుతానని బెదిరింపులకు గురి చేస్తున్నారని లలితాయాదవ్ ఆరోపించారు.

అరూరికి ఏనుగల్లు మాదిగ సంఘం మద్దతు

పర్వతగిరి: బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్‌కు మండలంలోని ఏనుగల్లుకు చెందిన మాదిగ సంఘం కులస్తులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మాసాని వెంకట్, మండల యూత్ ప్రెసిడెంట్ నరేందర్‌వర్మ పాల్గొన్నారు.

అభివృద్ధే 'అరూరి'ని గెలిపిస్తుంది

వరంగల్: నగరంలోని 14వ డివిజన్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ చేసిన అభివృద్ధి పనులే ఆయనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుసు నర్సింహ అన్నారు. రమేష్‌ను గెలిపించాలంటూ ఏనుమాముల మార్కెట్ నుంచి 100 ఫీట్ల రోడ్డు మీదుగా నర్సంపేట ప్రధాన రహదారి వరకు భారీ ర్యాలీగా పాదయాత్ర నిర్వహించారు. కార్పొరేటర్ తూర్పాటి సులోచన, నాయకులు పాల్గొన్నారు.

బహుభాషావేత్త కాళోజీ నారాయణరావు



పింగిళిలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు



హనుమాన్‌నగర్‌లో..

హన్మకొండ అర్బన్: తెలుగుతో పాటు మరాఠీ, కన్నడ, హిందీ, ఉర్దూ భాషల్లో కూడా కవితలు రాసిన కాళోజీ నారాయణరావు బహుభాషావేత్త అని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో తెలుగు విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ వివక్ష ఎక్కడున్నా వ్యతిరేకించి, మంచి ఎక్కడున్నా స్వాగతించే స్వభావం గల వ్యక్తి కాళోజీ అని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాళోజీ పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, సురేష్‌బాబు, తెలుగు విభాగం అధ్యాపకులు కపిల భారతి, ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన రాధిక, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సాహితీవేత్త..

హన్మకొండ: ప్రజా కవి, గొప్ప సాహితీవేత్త కాళోజీ నారాయణ రావు అని బీఆర్‌ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి కొనియాడారు. కాళోజీ వర్ధంతిని హనుమకొండ హనుమాన్‌నగర్‌లో సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, అన్యాయాల మీద తన పదునైన కలంతో ప్రశ్నించిన గొప్ప సాహితీవేత్త కాళోజీ అని గుర్తుచేశారు. తన రచనల ద్వారా స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించారని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సౌరభం, ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు. మొట్ల మనోహర్, కుమార్ రెడ్డి, మాదారపు ఉదయ్‌కిరణ్, శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, కృష్ణమూర్తి, నరేష్, షణ్ముక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



కిర్‌సింగ్ (ఫైల్)

కాశిబుగ్గ: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి తండాకు చెందిన బాదావత్ కిర్‌సింగ్ (43) మానసిక స్థితి సరిగాలేక 10ఏళ్ల క్రితం ఆర్మీలో ఉద్యోగం, భార్య పిల్లలను వదిలేసి నెక్కొండలో ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రైలు పట్టాలు దాటుతుండగా మూడవ లైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో తలపగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి కిర్‌సింగ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..



మృతుడు

కాశిబుగ్గ: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి ఓ గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య గేటుపల్లి రైల్వేగేట్ సమీపంలో సోమవారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 25 – 30 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలకు వరంగల్ జీఆర్పీ స్టేషన్‌లో, 87126 58585 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీసీఎం వ్యాన్ ఢీకొని..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డు నీలిమా జంక్షన్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం, గున్నెపల్లి గ్రామానికి చెందిన చిల్లా సిద్ధార్థ (21) విశాల్‌మార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి విధులు ముగించుకొని అదాలత్ వైపు వస్తుండగా విష్ణుప్రియ గార్డెన్‌కు వైపు వెళుతున్న డీసీఎం వ్యాన్ అతన్ని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బైక్‌పై ఉన్న మరో ఇద్దరు గుగులోతు పవన్, ప్రమోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి చిల్ల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న షణ్ముఖ రాజన్

ఖిలా వరంగల్ / వరంగల్ అర్బన్: సమస్యాత్మక (క్రిటికల్) పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముఖ రాజన్ సూచించారు. వరంగల్ (తూర్పు) 106 నియోజకవర్గ పరిధిలోని వరంగల్, ఖిలా వరంగల్ మండలాల పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ తూర్పులో మొత్తం 231 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. అదనపు కేంద్ర బలగాల మోహరింపు, లైవ్ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఆర్వోలు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్లు ముస్క శ్రీనివాస్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడు రాజేష్ కుమార్ సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ (తూర్పు) – 106 నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికపై సోమవారం చర్చించారు. వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 230 పోలింగ్ కేంద్రాల్లో 57 సమస్యాత్మక (క్రిటికల్) పోలింగ్ కేంద్రాలుగా ఇప్పటికే గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు.

గిరిజనులను పట్టించుకోని ప్రభుత్వం




సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న నాయక్

నయీంనగర్: గిరిజనులకు ప్రత్యేక గిరిజన కమిషన్, గిరిజన బంధు, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ వీరన్న నాయక్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.16 వేల కోట్లకు పైగా మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. నేడు 5లక్షల కోట్లకు పైగా అప్పులతో తెలంగాణను ఊబిలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో విద్యా, వైద్యం నిర్లక్ష్యానికి గురైనట్లు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గాలికి వదిలేశారని, యూనివర్సిటీలలో 85శాతం ఖాళీలున్నా భర్తీ చేయడం లేదని వాపోయారు. గిరిజన రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు గిరిజనులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రకళ, అడ్వకేట్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ జయంత్ సింగ్, అరుణ్ నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను ఆదుకోవాలి

హన్మకొండ: వీధి వ్యాపారులను ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఈమేరకు ప్రధాన పార్టీలు తమ మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపరచాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేత శ్రీధర్‌బాబుకు లేఖ రాశారు. ఆ లేఖను హనుమకొండలో సోమవారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వీధి వ్యాపారుల కష్టాలను నాయకులంతా ప్రత్యక్షంగా చూశారని గుర్తుచేశారు. బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు వీధి వ్యాపారులకు కూడా చేయూతనందించేలా స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో వీధి వ్యాపారులు సురేష్, బయ్య వేణు, తదితరులు పాల్గొన్నారు.

వారిపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నయీంనగర్: ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని పోరాటం చేస్తున్న రైతులు, యువకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, వెంటనే వారిని విడుదల చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా మరికాల్ మండలం చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని పరిసర గ్రామాల ప్రజలు రెండేళ్లుగా పోరాడుతున్నారని తెలిపారు. వారిని అక్రమంగా అరెస్టు చేసి జైల్‌లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి అరెస్టును వివిధ ప్రజా సంఘాల నాయకులు ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తంపుల మొగిళి, ఉదమ్‌సింగ్, గుండె ప్రమోద్, గాదరి చిన్న, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపురంలో గొర్రెల కొట్టం దగ్ధం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురం గ్రామంలో ఓ గొర్రెల కొట్టం దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘటనలో 50 గొర్రెలు సురక్షితంగా బయటపడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దాపురం గ్రామానికి చెందిన ముస్కు గోపాల్‌కు 50 గొర్రెలు ఉన్నాయి. గొర్రెలను ఆదివారం మేతకు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి ఇంటి వద్ద కొట్టంలో ఉంచాడు. కొట్టం నుంచి అర్ధరాత్రి పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి గోపాల్ సమాచారం అందించారు. దాంతో గొర్రెలను కుటుంబ సభ్యులు బయటికి పంపించారు. గుర్తు తెలియని వ్యక్తులు కొట్టానికి నిప్పు పెట్టారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సై సురేష్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చీకటి వెలుగుల పండుగ దీపావళి



చిచ్చుబుడ్డి కాలుస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్



ఖిలా వరంగల్‌లో చిన్నారులు, మహిళలు



కాజీపేట: సహృదయ ఆశ్రమంలో..



కాజీపేటలో వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

నగరవ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమ ఇళ్లను అందంగా అలంకరించి, రాత్రి వేళల్లో మంగళగౌరి కేదారేశ్వర నోములు నోముకున్నారు. పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, బంధుమిత్రులకు భోజనాలు పెట్టారు. టపాసులు కాలుస్తూ సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

రేవంత్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

వరంగల్: ఖిలా వరంగల్ మండలం మామునూరు లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్న, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాల్గొననున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ కోరారు. పార్టీ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్.నాగరాజుతో కలిసి హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ఆరు గ్యారంటీల హామీలతో ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ విడుదల చేసిందని వివరించారు. దళిత బంధు పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ తన సన్నిహితులకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. చెరువులు కుంటలను కబ్జా చేశారని అన్నారు. అనంతరం, నాగరాజు మాట్లాడుతూ తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ ధర్మసేన, ఎల్డీఎం కోఆర్డినేటర్ కుందూరి వెంకట్‌రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు, పింగిలి వెంకటరెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దు



మాట్లాడుతున్న మొగిలిచెర్ల సుదర్శన్

ఖిలా వరంగల్: ప్రజాస్వామ్యయుతంగా జరగనున్న ఎన్నికల్లో ఓటర్లను నాయకులు ప్రలోభాలకు గురిచేసి, ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దని కన్స్యూమర్ కన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన ఓటు వినియోగం – చైతన్యంపై న్యాయ సలహాదారుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం –2005 ప్రకారం నాలుగేళ్లుగా ప్రభుత్వ శాఖల నుంచి పలు అంశాలను సేకరించినట్లు తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం, అభివృద్ధి మాటున జరిగిన అక్రమాలు, ధరణి పోర్టల్ దుర్వినియోగంతోపాటు చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని వివరించారు. నియంత్రణ లేని ధరల పెరుగుదల, మితిమీరిన కల్తీ, మద్యం విక్రయాలు సామాన్య ప్రజలకు ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టం కలిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య కార్యక్రమాలపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3,200 మంది వలంటీర్లను నియమించి ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు రంగరాజు, ఆనందరావు, రాయబారపు భిక్షపతి, అనిల్ కుమార్, జంపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాజేందర్

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును దుర్వినియోగం చేయొద్దని, అవినీతిని అంతమొందించే దిశగా ఓటర్లు అడుగులు వేయాలని చెప్పారు. రాష్ట్రంలో దళితులపై కొనసాగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, అవకాశాలను భిక్షగా కాకుండా హక్కుగా అమలు చేయాలన్నారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు శ్రీనివాస్, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు మెగా డయాబెటిస్ శిబిరం

నయీంనగర్: నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ డయాబెటిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాల్‌పూర్ చౌరస్తా, ఎర్రగట్టు గుట్ట, వడ్డేపల్లి చర్చి కాంపౌండ్, కేయూ క్రాస్ జంక్షన్, ఎంజీఎం జంక్షన్లలో మంగళవారం మెగా డయాబెటిస్ స్క్రీనింగ్, అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వేయి మందికి పైగా ప్రజలకు షుగర్ పరీక్షలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం, డాక్టర్ బత్తుల శ్రీధర్, డాక్టర్ జీ.చంద్రశేఖర్, డాక్టర్ పవన్, డాక్టర్ గంజి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అంకాతి శ్రవణ్, డాక్టర్ ఓరుగంటి రఘుపతి పాల్గొని పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్వీ 59వ డివిజన్ కమిటీ ఎన్నిక

విద్యారణ్యపురి: బీఆర్‌ఎస్వీ 59వ డివిజన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా అర్వింద్, ఇన్‌చార్జ్‌గా రాయుడు, కార్యవర్గ సభ్యులుగా సంపత్‌రెడ్డి, నీలం సుహాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, మతిన్, కల్యాణ్, హైమద్, విద్యార్థి, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా రాజు

హసన్‌పర్తి: కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా సిద్దాపురానికి చెందిన మంద రాజు నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి ప్రకటించారు. కాగా, తన నియామకానికి సహకరించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, నాయకులు తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డికి రాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.